సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



టన్ను చీనీ రూ.24,290

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,290, కనిష్టం రూ.5 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.14

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.7 ప్రకారం ధర పలికింది.



జిల్లా పరిధిలో గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'రాష్ట్రీయ బాల స్వాస్థ్య'ను విజయవంతం చేయండి

పుట్టపర్తి అర్బన్: పిల్లల్లో ఆరోగ్య సమస్యలను చిన్న వయస్సులోనే గుర్తించేందుకు ఏర్పాటు చేసిన రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి ఓ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 15న జిల్లాలో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 0–18 వయస్సులో అంగన్‌వాడీ, పాఠశాలల్లో ఉన్న పిల్లలకు 41 అంశాలలో 4డీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మొదటి స్థాయిలో హెల్త్ టీం పాఠశాలలకు వెళ్లి పిల్లలకు తల నుంచి పాదాల వరకూ పరీక్షిస్తారన్నారు. రెండోస్థాయిలో వైద్యులు ప్రతి గురు, శనివారాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్యలో రోజుకు 30 మంది చొప్పున స్క్రీనింగ్ చేస్తారన్నారు. అవసరమైన వారికి అక్కడే మందులు అందిస్తారని పేర్కొన్నారు. చికిత్స అవసరమైన వారిని దగ్గర్లోని ఆస్పత్రులకు రెఫర్ చేస్తారన్నారు. ఇంకా వైద్యం అవసరమైన వారికి వారి తల్లిదండ్రులతో కలిపి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్తారని తెలిపారు. మూడు పీహెచ్‌సీలకు కలిపి ఒక వాహనం ఏర్పాటు చేస్తారన్నారు. జిల్లాలో 2,822 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,10,652 మంది, 2053 పాఠశాలల్లో 1,54,255 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకూ 49,346 మంది పాఠశాల, 60,526 మంది అంగన్‌వాడీ చిన్నారులకు స్క్రీనింగ్ పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. యువకుడికి మూడేళ్ల జైలు



చిలమత్తూరు: ప్రేమ పేరుతో బాలికను వేధించిన ఓ యువకుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష పడింది. చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎస్. నరసప్ప కుమారుడు ఎస్. మధు అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వేధించేవాడు. బాలికను, ఆమె తల్లిని అంతు చూస్తా అని బెదిరించేవాడు. దీనిపై బాలిక ఫిర్యాదు మేరకు 2021లో చిలమత్తూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతపురం పోక్సో కోర్టులో కేసు విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదోపవాదనలు విన్న స్పెషల్ జడ్జి రాజ్యలక్ష్మి గురువారం తీర్పు వెలువరించారు. నేరం రుజువు కావడంతో నిందితుడు ఎస్. మధుకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు. అలాగే బాధిత యువతికి ప్రభుత్వం తరఫున రూ.50 వేలు చెల్లించాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ వాదించారు. కోర్టు లైజెన్ ఆఫీసర్ శ్రీనివాసులు (ఏఎస్‌ఐ), చిలమత్తూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గురుస్వామి, స్పెషల్ పీపీ ఈశ్వరమ్మను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ఆంధ్రా జట్టుకు ఎంపిక



బుడగల నేహ



ఆశ్రియ

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-19 ఉమెన్ వన్డే క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన బి.నేహ, ఎస్.ఆశ్రియ (కదిరి) ఉన్నారు. కేరళలోని త్రివేండ్రమ్ వేదికగా జనవరి 4 నుంచి 12వ తేదీ వరకూ మ్యాచ్‌లు జరుగుతాయి.

రైలు బండి.. పొడిగింపేదండీ?

- ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (నంబరు 17215) మచిలీపట్నం నుంచి ధర్మవరానికి రోజూ వస్తుంది. ఉదయం 8.35 గంటలకు అనంతపురం చేరుకుంటుంది. అక్కడి నుంచి ధర్మవరానికి 9.50కు చేరుతుంది. తిరిగి సాయంత్రం 5.35 వరకూ అక్కడే హాల్ట్ చేస్తారు. ఆ సమయంలో పుట్టపర్తి వరకు కొనసాగిస్తే.. అనంతపురం నుంచి పుట్టపర్తికి వచ్చే ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుంది. సుమారు 5.30 గంటల పాటు అక్కడే ఉండటంతో ఏం ఉపయోగమని ప్రశ్నిస్తున్నారు.
- కేఎస్‌ఆర్ బెంగళూరు – శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం మెము (నంబరు 06515) ఉదయం 11.05 గంటలకు పుట్టపర్తి చేరుకుంటుంది. తిరిగి సాయంత్ర 3.30 గంటల వరకు అక్కడే హాల్ట్ చేస్తారు. సుమారు 4 గంటల పాటు సమయం ఉంటుంది. ఆ మధ్యలో అనంతపురం వరకు వెళ్లి వస్తే ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. పైగా ఆ సమయంలో పుట్టపర్తి నుంచి అనంతపురం వెళ్లే రైలు ఒక్కటి కూడా లేదు.
- హిందూపురం నుంచి యశవంతపురం ఎక్స్‌ప్రెస్ స్పెషల్ (నంబరు 06518) రోజూ ఉదయం 7.30 గంటలకు హిందూపురం చేరుకుంటుంది. ఆ తర్వాత తిరిగి సాయంత్రం 4 గంటలకు బయలుదేరుతుంది. సుమారు 8 గంటల పాటు పట్టాలపై హాల్ట్ చేస్తున్నారు. ఆ సమయంలో రైలును అనంతపురం వరకూ నడిపితే ఎంతోమందికి ఉపయోగం ఉంటుంది. సమయం ఉన్నా.. అడిగే వారు లేక రైళ్లు నిరుపయోగంగా మారాయి.



- అనంత – పుట్టపర్తి మధ్య పెరిగిన ప్రయాణికుల రాకపోకలు
- పలు రైళ్లను పొడిగించకపోవడంతో తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ఇద్దరు ఎంపీలు
- స్టేషన్లలోనే గంటల తరబడి రైళ్ల హాల్ట్
- దానిబదులు రైళ్లను పొడిగిస్తే మేలంటున్న ఉద్యోగులు



ధర్మవరం స్టేషన్‌లో హాల్ట్ ఉన్న మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు



పుట్టపర్తి రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

సాక్షి, పుట్టపర్తి: రైళ్లు ఉన్నప్పటికీ సరైన సమయానికి రాకపోవడం.. సమయం బోలెడు ఉన్నా.. ఒక్క స్టేషన్‌కే రైళ్లు పరిమితం కావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లాల్సిన ఇద్దరు ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి మౌనంగా ఉండటంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి రోజూ వందల సంఖ్యలో ప్రజలు, ఉద్యోగులు వచ్చి వెళ్తుంటారు. అయితే ప్రయాణికులకు అనుగుణంగా రవాణా సౌకర్యం లేదు. సరైన సమయంలో రైళ్ల సర్వీసులు కూడా లేకపోవడంతో బస్సులే దిక్కవుతున్నాయి. ధర్మవరం నుంచి ఒక రైలు.. హిందూపురం మీదుగా పుట్టపర్తి నుంచి అనంతపురం వరకూ మరో రైలును పొడిగించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

రోజూ వస్తే మరింత ఉపయోగం..

కొండవీడు ఎక్స్‌ప్రెస్ (నంబరు 17212) సాయంత్రం 5.15 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటుంది. కేవలం మంగళ, గురు, శనివారాల్లో మాత్రమే రావడంతో మిగతా రోజుల్లో ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సరిగ్గా తమ పనులు ముగిసిన వెంటనే అందుబాటులో ఉండే కొండవీడు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. కొండవీడు రైలు రాని రోజుల్లో విధులు ముందుగా ముగించుకుని సాయంత్రం 4.35 గంటలకు ప్రశాంతినిలయం ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి.. లేదంటే ఆ తర్వాత సాయంత్రం 6.40 గంటలకు వచ్చే కాచిగూడ ఎక్స్‌ప్రెస్ వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి.

ఆ మూడు రైళ్లొచ్చినా చాలంటూ..

యశవంతపురం నుంచి వచ్చే హిందూపురం ఎక్స్‌ప్రెస్ స్పెషల్, బెంగళూరు నుంచి వచ్చే శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం మెము రైలు, మచిలీపట్నం నుంచి వచ్చే ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఒక్కో స్టేషన్ చొప్పున పొడిగించినా.. పుట్టపర్తి నుంచి అనంతపురానికి రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. అలాగే కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను రోజూ నడిచేలా చేస్తే నిత్యం అనంతపురం నుంచి పుట్టపర్తికి ప్రయాణించే ఉద్యోగులకు చాలా అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు.

పుట్టపర్తి వరకూ పొడిగించాలి



ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలును ఉదయం పూట కనీసం పుట్టపర్తి వరకూ పొడిగించినా వందల మందికి ఉపయోగకరంగా ఉంటుంది. ఉదయం 8 గంటలు దాటిన తర్వాత పుట్టపర్తికి వెళ్లాలంటే తప్పనిసరిగా బస్సు ఎక్కాల్సిందే. ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ను అక్కడి వరకూ పొడిగిస్తే బాగుంటుంది.

– రామకృష్ణ, ప్రయాణికుడు, ధర్మవరం

సమయానుగుణంగా నడపాలి



ప్రజల అవసరాలకు అనుగుణంగా రైళ్లు నడిపితే బాగుంటుంది. గత్యంతరం లేక చాలాసార్లు అధిక డబ్బులు చెల్లించి బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. రైల్వే అధికారులు ఇప్పటికైనా ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలి.

– గంగాద్రి, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి

సర్వీసులు పెంచాలి



ప్రశాంతి నిలయం సందర్శనకు వచ్చే వారితో పాటు పుట్టపర్తికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. భక్తులు, ఉద్యోగులు, వ్యాపారులను దృష్టిలో ఉంచుకుని రెండు, మూడు రైళ్లను పుట్టపర్తి మీదుగా నడపాలి. హిందూపురం ప్యాసింజర్, పుట్టపర్తి ప్యాసింజర్‌ను పొడిగిస్తే మేలు.

– సుబ్రహ్మణ్యం, పుట్టపర్తి

అనంతపురం వరకు పొడిగించాలి



యశవంతపురం నుంచి హిందూపురం వచ్చే రైలు సుమారు 8 గంటల పాటు అక్కడే ఉండిపోతోంది. ఆ సమయంలో అనంతపురం వెళ్లాలంటే ఒక్క రైలు కూడా లేదు. అదే రైలును పుట్టపర్తి మీదుగా అనంతపురం వరకూ పొడిగిస్తే ఎంతోమందికి మేలు.

– ఉదయ్, ప్రయాణికుడు, హిందూపురం

బాలుడి అదృశ్యం.. విషాదాంతం

- లెట్రిన్ పిట్‌లో శవమై తేలిన అహ్మద్ ఆల్మర్



అహ్మద్ ఆల్మర్ (ఫైల్)



లెట్రిన్ పిట్ నుంచి బాలుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలో బాబయ్య దర్గా గంధం ఉరుసుకు తల్లిదండ్రులతో కలసి వచ్చిన బాలుడు అహ్మద్ ఆల్మర్ (04) అదృశ్యం విషాదాంతంగా ముగిసింది. నిన్న మొన్నటి వరకూ బాలుడు కిడ్నాప్ అయ్యాడనే పోలీసులతో పాటు అందరూ భావించారు. అయితే గురువారం ఉదయం బాలుడు బాబయ్య దర్గా సమీపంలోని లెట్రిన్ పిట్‌లో పడి మరణించాడన్న సమాచారం రావడంతో పోలీసులు, దర్గాపేట వాసులు, భక్తులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్‌ఐ. వెంకటేశ్వర్లు సిబ్బంది ఆ ప్రాంత పెద్దల సమక్షంలో బాలుడి మృతదేహాన్ని బయటకు తీయించారు. బాబయ్య దర్గా సమీపంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేసిన దర్గా నిర్వాహకులు ఆ ప్రాంతంలో పిట్ తవ్వి దాన్ని అలాగే వదిలేశారు. అయితే ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఉన్నా ఆ ప్రాంతానికి బాలుడు ఎలా వెళ్లి లెట్రిన్ పిట్‌లో పడి చనిపోయాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కారకులపై తగిన చర్యలు చేపడతామన్నారు.

దర్గా అభివృద్ధి పట్టించుకోని వక్ఫ్‌బోర్డు..

బాబయ్య దర్గా ఉరుసు, గంధం వేడుకలకు సంబంధించిన నిర్వహణను వక్ఫ్‌బోర్డు తీసుకుంది. ఏటా హుండీలు లెక్కించడమే తరువాయి డబ్బు వక్ఫ్ బోర్డుకు వెళ్తుంది. అయితే ఏ ఒక్క సౌకర్యాన్ని ఏర్పాటు చేయని వక్ఫ్‌బోర్డ్ దర్గాకు వచ్చే ప్రతి రూపాయి తీసుకుని దర్గా అభివృద్ధికి, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి అహ్మద్ ఆల్మన్ ఉదంతం నిదర్శనంగా నిలుస్తుందని చెబుతున్నారు.

విధుల్లో అలసత్వం సహించం

- ఉద్యోగులకు కలెక్టర్ చేతన్ హెచ్చరిక



ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పనితీరుపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో మహిళా శిశు సంక్షేమశాఖ అన్ని అంశాల్లో పూర్తిగా వెనుకబడింది. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాజెక్టుల పనితీరు గురించి ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీడీ సుధా వరలక్ష్మి, సీడీపీఓలతో అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో సక్రమంగా పాలు, గుడ్లు, పంపిణీ జరిగేలా చూడాలన్నారు. మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇకపై ఐసీడీఎస్ పనితీరుపై తానే స్వయంగా పర్యవేక్షిస్తానని, పనితీరులో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పరిశ్రమల స్థాపనకు చర్యలు..

నూతన పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ అమలు చేస్తున్న తరుణంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలశాఖ, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవాడల ఏర్పాటుకు తీసుకున్న చర్యలు, ప్రగతి అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలన్నారు. కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంలో అర్హులైన లబ్ధిదారుల పేర్లను తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ పార్కుల స్థాపనకు ప్రైవేట్ యాజమాన్యం ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపనకై భూ కేటాయింపులు చేపట్టవచ్చని, దీనికి ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పిస్తోందన్నారు. పరిశ్రమల విస్తరణ అధికారి సంజీవ రాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సహానా సోనీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



వసంతోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

మడకశిరరూరల్: భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడగుంట అంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నిర్వహించిన వసంతోత్సవం, చక్రస్నానంతో ముగిశాయి. ఉదయం స్వామి వార్లను అలంకరించి ప్రత్యేక పూజ కార్యక్రమాలతో వసంతోత్సవం నిర్వహించారు. అలాగే వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున స్వామివార్లకు జ్యోతులను సమర్పించారు. వారం రోజుల పాటు అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ దేవదాయశాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు హుండీల లెక్కింపు..

భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

ప్రయాణికుల సురక్షిత ప్రయాణంపై దృష్టి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి

ధర్మవరం అర్బన్: రైల్వే ప్రయాణికుల సురక్షిత ప్రయాణంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారిపై ఉందని ప్రిన్సిపల్ చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ధర్మవరం రైల్వేస్టేషన్‌ను గురువారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్‌లోని వివిధ విభాగాల కార్యాలయాల రికార్డులను పరిశీలించారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లేలా సిద్ధమై ఉండాలన్నారు. అనంతరం గొల్లపల్లి రైల్వే గేటును తనిఖీ చేశారు. తర్వాత సిగ్నల్ సిస్టం గదులు, స్టేషన్ మాస్టర్ గదులు, ప్రయాణికులు వేచి ఉండే గదులను పరిశీలిస్తూ ప్రయాణికుల ద్వారా సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్రన్, స్టేషన్‌మాస్టర్ నరసింహనాయుడు, ఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



సాక్షి పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పంచాయతీరాజ్ విభాగానికి సి.రాజారెడ్డి, గ్రీవెన్స్‌సెల్‌కు ఎస్ రమాకాంత్‌రెడ్డి. కల్చరల్ విభాగానికి వాల్మీకి బద్రీనాథ్‌ను నియమించారు. అలాగే విద్యార్థి విభాగానికి టి.పురుషోత్తం, మున్సిపల్ వింగ్‌కు గజ్జల శివ, ఆర్‌టీఐ వింగ్‌కు కె. రామాంజనేయులు, చేనేతలకు సంబంధించి జింకా కంబగిరిని నియమించారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మడకశిర మండలం జమ్మానిపల్లికి చెందిన నరసింహమూర్తి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఎల్ఎస్ రంగప్పను నియమించారు. యూత్ విభాగం అధ్యక్షుడిగా కనగానపల్లి మండలానికి చెందిన మద్దెలచెరువు గంగుల సుధీర్‌రెడ్డి, వలంటీర్ విభాగానికి హరినాథరెడ్డి, సోషల్ మీడియా విభాగానికి బి.అభిలాష్‌ను ఎంపిక చేశారు. ఎస్టీ సెల్ విభాగానికి గోవింద్ నాయక్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు టి.వీరనారాయణ, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వి.ప్రసాద్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడిగా వై.రామసుబ్బారెడ్డి, బీసీ సెల్‌కు ఎం.నారాయణ, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా జి.మల్లికార్జున, ఐటీ వింగ్‌కు డి.గంగిరెడ్డి, డాక్టర్స్ వింగ్‌కు ఎస్.రమేష్, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా ఆర్.భాస్కర్‌రెడ్డిని నియమించారు. మహిళా విభాగానికి సి.నాగమణి, మైనార్టీ సెల్‌కు ఎస్.చంద్‌బాషా, వాణిజ్య విభాగానికి సీవీ మహేష్, బూత్ కమిటీల అధ్యక్షుడిగా వాల్మీకి లోకేష్‌లను ఎంపిక చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



టెన్నికాయిట్ ఆడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు స్పోర్ట్స్‌మీట్ ఉల్లాసంగా ఉత్సాహంగా జరుగుతోంది. రెండోరోజైన గురువారం ధర్మవరం, కదిరి, హిందూపురం, పుట్టపర్తి, పెనుకొండ సబ్ డివిజన్లు, ఆర్మ్‌డ్ విభాగాలకు చెందిన క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఎస్పీ రత్న టెన్నికాయిట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, 100, 400 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు.

వాలీబాల్ విజేతగా ధర్మవరం..

వాలీబాల్ పోటీల్లో ధర్మవరం సబ్ డివిజనల్, ఆల్ వింగ్స్ మధ్య జరిగిన ఫైనల్ పోటీలో ధర్మవరం సబ్ డివిజన్ జట్టు విజేతగా నిలిచింది. అలాగే కబడ్డీ ఫైనల్‌లో ధర్మవరం సబ్ డివిజన్‌తో తలపడిన జిల్లా ఆర్మ్ రిజర్వ్‌డ్ జట్టు విజేతగా నిలిచింది.



లాంగ్ జంప్ ఇలా...



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



కబడ్డీ ఆడుతున్న దృశ్యం

వనరుల సంరక్షణ అందరి బాధ్యత

ఎన్పీకుంట: ఉమ్మడి వనరులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని సారగుండ్లపల్లి సమీపంలో పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలో ఎఫ్‌ఈఎస్ సంస్థ ఆధ్వర్యంలో 'పాపాగ్ని పిలుపు' కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ, ఏపీడీ, అటవీశాఖ అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె సంఘాల ద్వారా కొండల్లోని చెట్లను కొట్టకుండా కట్టుబాట్లను పెట్టుకొని ఉమ్మడి వనరుల పునరుద్ధరణకు ప్రణాళికలు తయారు చేసుకుంటున్నట్లు వివరించారు. రాబోయే పది సంవత్సరాలలో పాపాగ్ని పరివాహక ప్రాంతం పరిరక్షణకు చేపట్టవలసిన పనులపై చర్చించారు. డీఈఈ బయప్ప, డీఎఫ్‌ఆర్‌ఓ రామచంద్రనాయక్, డ్వామా ఏపీడీ రమేష్‌బాబు, సర్పంచ్ శీలంవెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీరభద్రుని సేవలో రాష్ట్ర పరిశోధక సంస్థ నిపుణుడు



గణపతి విగ్రహం వద్ద గంగిరెడ్డి, తదితరులు

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రునిస్వామిని రాష్ట్ర పరిశోధక విద్యా శిక్షణా సంస్థ నిపుణులు గంగిరెడ్డి గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ విశేషాలను వివరించారు.

వివాహం కాలేదని యువకుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: పెళ్లి కాకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన పుల్లయ్య కుమారుడు కిరణ్ (32) కూలి మగ్గం నేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో కిరణ్‌కు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో మనోవేదనకు గురైన కిరణ్ జీవితంపై విరక్తితో గురువారం పోతుకుంట మార్గంలోని పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పట్టాల వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



గుంతకల్లు: స్థానిక మద్దికెర రైలు మార్గంలో 335/11 కి.మీ వద్ద పట్టాల వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కదులుతున్న రైలు నుంచి కింద పడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి దాదాపు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసుంటుంది. తెల్లని గళ్ల చొక్కా, నల్ల రంగు ప్యాంట్ ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

కూర్చొన్న చోటే ప్రాణాలు వదిలాడు!



పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం క్రాస్ వద్ద గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దాదాపు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తాను కూర్చొన్న చోటు ప్రాణాలు వదిలాడని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రామగిరి ప్రాంతానికి చెందిన వాడై ఉంటాడనే అనుమానాలు వ్యక్తమైనట్లుగా పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96841, 94407 96842కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కనిపించిందా.. కాజేస్తారు!

- అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్
- సొంతిల్లు కట్టుకోవాలన్న మోజులో దొంగతనాలు
- రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి వైర్లు, సర్వీస్ కండక్టర్ల అపహరణ

నిర్మానుష్య ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనిపిస్తే చాలు వారు కాజేస్తారు. వాటిని ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను అపహరిస్తారు. ఒకట్రెండు కాదు... ఏకంగా 33 ప్రాంతాల్లో యథేచ్ఛగా చోరీలు సాగిస్తూ వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైర్లతో పాటు విలువైన సర్వీస్ కండక్టర్‌నూ అపహరించే వీరి ఆగడాలకు ఎట్టకేలకు తెరపడింది.

స్వాధీనం చేసుకున్న రాగి వైర్ల బరువు	450 కిలోలు
అల్యూమినియం వైర్ల బరువు	180 కిలోలు



స్వాధీనం చేసుకున్న రాగి వైర్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: విద్యుత్ శాఖలో దినసరి కూలీలుగా పనిచేస్తూ రైతుల వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన సర్వీస్ కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైర్లను అపహరించుకెళ్లే అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు.

నలుగురు పట్టుబడి... ఇద్దరు పరారై!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత ఏడాదిగా రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని రాగి తీగలను అపహరించుకెళ్లే ఘటనలు ఇటీవల పెచ్చుమీరాయి. దీంతో ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో సీసీఎస్ బృందం సీఐలు ఇస్మాయిల్, జైపాల్‌రెడ్డి, సిబ్బంది, అనంతపురం రూరల్ సీఐ శేఖర్, ఎస్‌ఐ రాంబాబు ఆధ్వర్యంలో బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో పక్కా ఆధారాలతో గురువారం ఉదయం కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన రాఘవేంద్ర, ఎర్రిస్వామి, రాంపురం గ్రామానికి చెందిన చిరంజీవి, పరంధామను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. మొత్తం 33 కేసుల్లో వీరు చోరీ చేసిన 450 కిలోల రాగి వైర్లు, 180 కిలోల సర్వీస్ కండక్టర్ (అల్యూమినియం)ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే కేసులో కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన వాసు, వెంకటాంపల్లికి చెందిన వన్నూరుస్వామి అలియాస్ జానీ పరారీలో ఉన్నారు.

ఒకరికొకరు తోడయ్యారు ఇలా...

పట్టుబడిన ముఠా సభ్యుల్లో రాఘవేంద్ర ప్రధాన నిందితుడు. వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. విద్యుత్ శాఖ అధికారులకు, హెల్పర్లకు సపోర్ట్ వర్కర్‌గా వెళ్లేవాడు. పని ఉన్న రోజు కూలీ ఇచ్చేవారు. సొంతిల్లు కట్టుకోవాలని ఆయన చిరకాల కోరిక. దీంతో రోజు వారీ కూలి కుటుంబపోషణకే సరిపోయేది కాదు. ఈ క్రమంలో సొంతింటి నిర్మాణం తీరని కలగానే మిగిలిపోతుందని భావించిన రాఘవేంద్ర... చోరీలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో తనకున్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పంట పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైర్లను, సర్వీస్ కండక్టర్లను అపహరించాలని పథకం వేశాడు. ఇందుకు విద్యుత్ బిల్లులు తీసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చిరంజీవి, పరంధామను జత చేసుకున్నాడు. వీరికి ఎలక్ట్రీషియన్లు వాసు, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి తోడయ్యారు. వీరు ముగ్గురూ విద్యుత్ శాఖ హెల్పర్లకు సపోర్ట్ వర్కర్లుగా వెళ్లేవారు.

పథకం ప్రకారం చోరీలు

తొలుత గ్రామాల్లో వన్నూరుస్వామి, ఎర్రిస్వామి సంచరిస్తూ రైతుల పొలాల్లో చోరీ చేయడానికి అనువైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రాఘవేంద్రకు సమాచారం ఇచ్చేవారు. అనంతరం వాసు, చిరంజీవి, పరంధామను కలుపుకుని రాఘవేంద్ర ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, అందులోని రాగి వైర్లను అపహరించేవారు. ఈ క్రమంలో కొత్త కనెక్షన్లకు సంబంధించి రైతులు సేకరించి పెట్టుకున్న సర్వీస్ కండక్టర్‌నూ ఎత్తుకెళ్లేవారు. అనంతరం వాటిని అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి వద్ద ఉన్న ఓ గుడిసె వద్దకు చేర్చి రాగి వైర్లు, అల్యూమినియం తీగలను కరిగించి ముద్దలుగా మార్చి విక్రయించి సొమ్ము చేసుకునేవారు. పక్కా ఆధారాలతో నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, విచారణ అనంతరం వారిచ్చిన సమాచారం మేరకు కక్కలపల్లి వద్ద గుడిసెలో దాచిన రాగి ముద్దలు, తీగలు, అల్యూమినియం సర్వీస్ కండక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న వాసు, వన్నూరుస్వామి కోసం గాలింపు చేపట్టారు. కాగా, నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ అభినందించారు.

నిందితులపై ఉన్న పాత కేసులు

నిందితుడు	కేసుల సంఖ్య
రాఘవేంద్ర	08
వాసు	03
ఎర్రిస్వామి	02

నిందితులపై ఉన్న కేసులు

పీఎస్	కేసుల సంఖ్య
కళ్యాణదుర్గం రూరల్	06
పుట్లూరు	04
అనంతపురం రూరల్	03
కంబదూరు	03
రాప్తాడు	03
చిలమత్తూరు	02
ఇటుకలపల్లి	02
తాడిపత్రి రూరల్	02
విడపనకల్లు	02
యాడికి	02
బుక్కరాయసముద్రం	02
గార్లదిన్నె	01
కుందుర్పి	01
మొత్తం	33

హెచ్‌ఎన్‌ఎస్ఎస్ పనులకు 'కూటమి' మోకాలడ్డు

- జలసాధన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

హిందూపురం: హంద్రీ–నీవా ప్రధాన కాలువను వెడల్పు చేయకుండా కేవలం లైనింగ్ పనులకు మాత్రమే పరిపాలన అనుమతులు ఇస్తూ జీఓలు జారీ చేయడం దారుణమని జల సాధన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, నాయకుడు శ్రీనివాసులుతో కలసి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కరువు పీడిత ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీ–నీవా కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా 6,300 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండేలా కాలువను వెడల్పు చేసేందుకు రూ.6,182 కోట్లను కేటాయించి 2021, జూన్ 7న జీఓ విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు కూడా జారీ చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓను రద్దు చేయడమే కాక భవిష్యత్తులో కాలువ వెడల్పు పనులు చేపట్టేందుకు వీలు లేని విధంగా కేవలం లైనింగ్ పనులకు మాత్రమే పరిపాలన అనుమతులు జారీ చేస్తూ జీఓ విడుదల చేయడం దారుణమన్నారు. హెచ్‌ఎన్ఎస్ఎస్ పనులకు మోకాలడ్డు పెట్టిన కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు అనంతపురంలోని హంద్రీ–నీవా చీఫ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సత్ప్రవర్తన అలవర్చుకోండి



బ్యారక్‌ను పరిశీలిస్తున్న జడ్జి శివప్రసాద్‌యాదవ్

ధర్మవరం అర్బన్: సబ్‌జైలులో శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో మెలుగుతూ విడుదలైన అనంతరం కుటుంబసభ్యులతో కలసి మంచి జీవితం వైపు అడుగు వేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. పట్టణంలోని సబ్‌జైలును గురువారం ఆయన తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ రూం, బ్యారక్‌లను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, 70 ఏళ్లు పైబడిన వారి అనారోగ్య సమస్యలపై ఆరా తీశారు. కోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది లేకపోతే లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ బ్రహ్మేంద్రరెడ్డి, న్యాయవాదులు బాలసుందరి, మోహన్‌ప్రసాద్, ప్యారా లీగల్ వలంటీర్ షామీర్‌బాషా, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి భూముల మార్కెట్ విలువ పెంపు

- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



భూముల విలువల పెంపుపై సమీక్షిస్తున్న జేసీ

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ ఆదేశాలమేరకు భూముల మార్కెట్ విలువ పెంపునకు సంబంధించి పనులను ఈనెల 27 నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మార్కెట్ విలువల సవరణ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పెంచిన మార్కెట్ విలువను ప్రజలకు తెలిసే విధంగా రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేయాలన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24 వరకూ ప్రజలు తెలియజేయవచ్చన్నారు. డిసెంబర్ 27న విలువల నిర్ణయ కమిటీలో చర్చించి ఆమోదం పొందిన తర్వాత జనవరి 1 నుంచి మార్కెట్ విలువను పెంచుతామన్నారు. సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఉమ్మడి జిల్లా అధికారిణి విజయలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం..

గుడిబండ: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని జేసీ అభిషేక్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని మోరుబాగల్‌లో ప్రకృతి వ్యవసాయం, రాగి పంట విస్తీర్ణం పెంపుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జేసీ అభిషేక్‌కుమార్, డీఈఓ సుబ్బారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. రైతులు తయారు చేసిన కషాయాలను పంటలకు ఏ దశలో, ఎలా వాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.

మెరుగైన కార్గో సేవలు అందించండి



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్

పుట్టపర్తి టౌన్: క్రిస్మస్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని కార్గో ద్వారా సంబంధీకులకు గిఫ్ట్‌లు, ఇతర సామగ్రిని పంపించే వారి సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ ఆదేశించారు. కార్గో సేవలు, బస్సుల నిర్వహణ అంశాలపై గురువారం తన కార్యాలయంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్షించారు. పండుగల వేళ తక్కువ ధరతో కార్గో సేవలను అందుబాటులోకి తీసుకురావాన్నారు. ఈ నెల 20 నుంచి కార్గో మాసోత్సవాలను నిర్వహించి కార్గో ప్రాధాన్యతపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని డిపోల నుంచి హైదరాబాదు, బెంగళూరు, తిరుపతి, విజయవాడ నగరాలకు జనవరి 9 నుంచి 12వ తేదీ వరకు సాధారణ చార్జీలతోనే 140 ప్రత్యేక సర్వీసులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో కూడా జనవరి 16నుంచి 19వ తేదీ వరకు 70 సర్వీసులు నడపాలని ఆదేశించారు.

3వ తరగతి విద్యార్థుల మధ్య ఘర్షణ

బత్తలపల్లి: మండలంలోని కోడేకండ్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల మధ్య గురువారం ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. కోడేకండ్ల ప్రాథమిక పాఠశాలలో 19 మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. వీరికి గత ప్రభుత్వంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చాక సర్దుబాటు పేరుతో ఒక ఉపాధ్యాయురాలిని ఇక్కడ ఉంచి, మరోకరిని వేరే పాఠశాలకు సర్దుబాటు చేశారు. దీంతో అన్ని తరగతులకు సంబంధించి 19 మంది విద్యార్థులకు సునీత అనే ఉపాధ్యాయురాలు బోధన చేస్తోంది. గురువారం టీచర్ సెలవు పెట్టడంతో ఎంఈఓ ఆదేశాల మేరకు డి.చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తిప్పేస్వామి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థుల మధ్య ఘర్షణ చెలరేగింది. మూడవ తరగతి చదువుతున్న బాలుడిపై మరో విద్యార్థి రాళ్లతో దాడి చేశాడు. దీంతో విద్యార్థి చేతికి తీవ్ర గాయమైంది. స్థానికుల సాయంతో ఉపాధ్యాయుడు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు విద్యార్థి ఎడమ చేతి వేళ్లు తొలగించాల్సి వస్తుందని తెలిపారు. కాగా, పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని గ్రామస్తులు తెలిపినా ఎంఈఓ పట్టించుకోలేదని, దీంతో సరైన పర్యవేక్షణ లేక ఈ పరిస్థితికి దారి తీసిందంటూ గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

వ్యాపారి ఆత్మహత్య



మృతుడు సోమశేఖర్

అనంతపురం: వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం యాదాలంకపల్లికి చెందిన సోమశేఖర్(40) కుటుంబంతో సహా వలస వచ్చి అనంతపురం – ధర్మవరం మార్గంలోని పంగల్ రోడ్డు వద్ద హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారం సక్రమంగా జరగక పోవడంతో అప్పుల భారం పెరిగింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సోమశేఖర్ బుధవారం ఉదయం పురుగుల మందు తాగాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోలుకున్న అనంతరం గురువారం ఉదయం వైద్యులు డిశ్చార్జ్ చేయడంతో ఇంటికి పిలుచుకొచ్చారు. సాయంత్రం బయటకు వెళ్లివస్తానంటూ ఇంట్లో చెప్పి వచ్చిన సోమశేఖర్ నేరుగా పాలిటెక్నిక్ కళాశాలలోని క్రికెట్ గ్రౌండ్ వెనుక ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. అంతకు ముందు తాను ఆత్మహత్య చేసుకున్నట్లు సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపాడు. దీంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని, ఉరికి వేలాడుతున్న సోమశేఖర్‌ను కిందకు దించి ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్‌లో నివాసముంటున్న యువతి కనిపించడం లేదు. ఈ మేరకు తల్లి ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బంధువుల అబ్బాయితో ఈ నెల 18న ఎస్టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల వెనుక ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఆమెకు వివాహ నిశ్చితార్థం ఏర్పాటు చేశారు. దీంతో బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఆమె ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కదిరికి చెందిన మునివర్ధన్ (గజ), చిన్నాన్న పవన్ కారణమంటూ అనుమానాలు వ్యక్తం చేస్తూ యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

నా కోసం వెతకొద్దు!

- ప్రేమికుడి వద్దకు వెళ్తున్నా
- లేఖ రాసి అదృశ్యమైన యువతి
- అనంతపురం జిల్లా కురుగుంటలో ఘటన

రాప్తాడు రూరల్: 'అమ్మా నా కోసం ఎక్కడా వెతకొద్దు. ప్రేమించిన వ్యక్తి వద్దకు వెళ్తున్నా' అంటూ లేఖ రాసి ఓ యువతి అదృశ్యమైన ఘటన గురువారం అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో వెలుగు చూసింది. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... కురుగుంటలో నివాసముంటున్న ముస్లిం దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త చనిపోయాడు. కుమారుడు బైకు మెకానిక్‌గా పని చేస్తుండగా, 22 ఏళ్ల వయసున్న కుమార్తె నగరంలోని ఓ షోరూంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ వదిలేసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో తల్లి ఇంట్లో పరిశీలించగా ఓ లేఖ లభించింది. అందులో 'అమ్మా... నేను సూర్య అనే యువకుడిని ప్రేమించా. ఆయనతోనే వెళ్తున్నా. మీరు నా కోసం వెతకొద్దు. విజయవాడ వెళ్తున్నా. వాళ్ల అమ్మానాన్న కూడా నన్ను బాగా చూసుకుంటారు. ఇంట్లో బంగారు, డబ్బులేవీ తీసుకెళ్లడం లేదు. అన్నా... అమ్మను బాగా చూసుకో' అంటూ రాసి ఉంది. ఈ లేఖను స్వాధీనం చేసుకున్న అనంతపురం రూరల్ పోలీసులు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీఓ కార్యాలయాన్ని పరిశీలించిన ఆర్‌జేటీసీ



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేటీసీ కృష్ణవేణి

హిందూపురం: జిల్లా రవాణాశాఖ హిందూపురం కార్యాలయాన్ని రాయలసీమ రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి గురువారం పరిశీలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, రోడ్ సేఫ్టీపై సూచనలు అందించారు. కదిరి ఆర్టీఓ శ్రీనివాసులు, ఎంవీఐలు డీఎస్ఎం వరప్రసాద్, రాణి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యతపై ఆర్‌ఎస్‌కే సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న జేడీఏ సుబ్బారావు

మడకశిర: స్థానిక వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందికి వృత్తి నైపుణ్యతపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ సుబ్బారావు మాట్లాడుతూ... ఆర్‌ఎస్‌కే సిబ్బంది తప్పని సరిగా ఈ–పంట నమోదు చేయాలన్నారు. రాగి పంట విస్తీర్ణాన్ని పెంచి, అధిక దిగుబడి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ.. వేరుశనగ, వరి, కంది పంటలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, పంటలలో చీడపీడల నివారణ చర్యలు ఎస్‌పీఎస్ఎస్, సీఎల్ఎస్ యాప్‌లపై అవగాహన కల్పించారు. ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ మాట్లాడుతూ... బిందు సేద్యం పరికరాల వినియోగంపై రైతులను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో మడకశిర డివిజన్ ఏడీఏ కృష్ణమీనన్, సిరికల్చర్ ఏడీ రాజు, ఏఓలు, ఏఈఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పేదోడి బతుకుపై 'టీడీపీ' దాడి

- జీవనోపాధి కోల్పోయిన నిరుపేద కుటుంబం



బంక్‌ను తొలగిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: టీడీపీ నాయకుల కక్ష సాధింపు చర్యలకు ఓ నిరుపేద కుటుంబం జీవనోపాధిని కోల్పోయిన రోడ్డున పడింది. వివరాలు.. కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పక్కన గ్రామ స్థలంలో స్థానికుడు శ్రీరామరెడ్డి ఓ బంక్ ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశాడన్న కక్షతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆయనపై స్థానిక టీడీపీ నేతలు వేధింపులకు పాల్పడుతూ వచ్చారు. ఈ క్రమంలోనే కుట్ర పన్ని బంక్ తొలగించడం ద్వారా ఆయన ఆర్థిక మూలాలపై దెబ్బ తీసేలా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ద్వారా తహసీల్దార్, ఎంపీడీఓపై ఒత్తిడి తీసుకెళ్లారు. దీంతో గురువారం ఉదయం తహసీల్దార్ నీలకంఠారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నటరాజ్... పోలీస్ సిబ్బందితో అక్కడకు చేరుకుని గ్రామ నౌకర్ల సాయంతో బంక్‌ను తొలగించారు. తన కుటుంబం వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపిందన్న కక్షతో ఇలాంటి చర్యలకు దిగజారడం దారుణమని శ్రీరామరెడ్డి వాపోయాడు.

నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

తాడిమర్రి: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 41 చెరువులను నింపడానికి విడుదల చేసిన పీఏబీఆర్ కుడి కాలువలోని నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రైతులను హెచ్చెల్సీ ఎస్ఈ ఎస్.రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం ఆయన పీఏబీఆర్ కాలువపై పర్యటించారు. తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి సమీపంలో నార్పల మండలం బండ్లపల్లి పప్పూరు గ్రామ రైతులు తమ గ్రామానికి చెందిన చెరువుకు నీటిని మళ్లించడాన్ని గుర్తించి, ఆ గ్రామ రైతులతో మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం దిగువన ఉన్న తాడిమర్రి మండల చెరువులను తొలుత నింపుతూ ఎగువ ప్రాంత చెరువులకు నీటిని అందించాల్సి ఉందన్నారు. ఈ అంశంలో రైతుల సహకారం చాలా అవసరమన్నారు. అలా కాకుండా అక్రమంగా కాలువలు తవ్వి నీటి చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీ డివిజన్ ఈఈ అబ్దుస్‌సమి, డీఈఈ పి.రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న ఉమ్మడిశెట్టి పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు ఉమ్మడిశెట్టి పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు, సీనియర్ కవి రాధేయ గురువారం తెలిపారు. 36వ పురస్కార విజేతగా ఎంపికైన సీనియర్ కవి డాక్టర్ బండిసత్యనారాయణకు, అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన ఉమ్మడిశెట్టి సతీష్‌కుమార్ జాతీయ యువ పురస్కారానికి ఎంపికైన రచయిత్రి చామర్తికి పురస్కారాలను అందజేయనున్నారు. ఇదే సందర్భంగా రాధేయ రాసిన 'అజేయుడు' స్మృతి కావ్యాన్ని ఆవిష్కరించనున్నారు. రాష్ట్రంలోని పలువురు కవులు రచయితలు ఆత్మీయ అతిథులుగా విచ్చేస్తున్న ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.